క్లుప్తంగా

రోడ్లపైనే మెటీరియల్ నిల్వలు



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్, కండ్రిక, రాధానగర్, ఏపీఎస్‌రెడ్డి రోడ్డు పరిసర ప్రాంతాలల్లో రోడ్లపై ఇంటి నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్స్ నిల్వ ఉంచి కట్టుబడి పనులను చేస్తుండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఇంటి యజమానులు రోడ్ల పైనే ఇసుక, కంకర, ఇటుక, లాంటి మెటీరియల్స్‌ను రోజుల తరబడి రోడ్లపై నిల్వ ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మెటీరియల్ రోడ్లుపై ఉండగా ఆటోలు, ద్విచక్రవాహనాలు, కనీసం రిక్షాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందంటున్నారు. సంబంధిత అధికారులు ప్లాన్ గురించి ఎంక్వయిరీ చేసి వెళ్లడం తప్ప ప్రజల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు




సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్‌లు సత్ప్రవర్తనతో మెలగాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటర్లపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండి కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. చట్టవ్యతిరేక చర్యలకు ప్పాడినట్లు తమ దృష్టికి వస్తే ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని తెలిపారు.

దేవీనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవం అయ్యింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా సామంతపూడి వెంకట సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శిగా కనకమేడల అనురాధ, కోశాధికారిగా రమేష్‌బాబు, సభ్యులుగా ధర్మారావు, సాంబశివరాజు, గౌరవాధ్యక్షుడిగా కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సామంతపూడి వెంకట సుబ్బరాజు, కనకమేడల అనురాధ మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిసామని తెలిపారు. స్థానిక సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ కలిసి మెలసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

భారత సైన్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భారత సైన్యం కోసం క్రైస్తవ విశ్వాసులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోలీ క్రాస్ మినిస్ట్రీస్ పాస్టర్ డేవిడ్ బ్రెన్‌హాం ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొని మన దేశ రక్షణ కోసం.. అమాయక ప్రజల ప్రాణాలను చిదిమేస్తున్న ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించాలని.. ప్రపంచ దేశాల మధ్య శాంతియుత వాతావరణం కల్పించాలని ప్రార్థించారు.

నేడు వీఎంసీలో పీజీఆర్‌ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారం చేసేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్‌ఎస్) నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలో ఉన్న సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్‌లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారిస్తారని చెప్పారు. నగరంలోని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. సమస్యలపై అర్జీలు అందించి పరిష్కారం పొందాలని కోరారు.

సింగ్‌నగర్‌లో రెచ్చిపోతున్న బైకు దొంగలు

పగలు, రాత్రి తేడా లేదు..
కన్నుపడితే మాయమే!

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పగలు, రాత్రి అనే తేడా లేదు.. జనాలు తిరుగుతున్నా.. ఆయా వాహనా యజమానులు కూతవేటు దూరంలో ఉన్నా.. భయమే లేదు.. వాళ్ల కన్ను పడిందా.. ఆ బైకు మాయమైపోవాల్సిందే.. ఇది సింగ్‌నగర్‌లో బైకు దొంగల చేతివాటం.

ఒక్క నెల్లో 10కి పైనే కేసులు

సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలకు పది కేసులకు పైనే బైకు చోరీ ఘటనలు వస్తున్నాయంటే ఇక్కడ బైకు దొంగతనాలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సింగ్‌నగర్, ఇందిరా నాయక్‌నగర్, తోటవారి వీధి, ఆంధ్రప్రభకాలనీ, పీఅండ్‌టీ కాలనీ ప్రాంతాల్లో దొంగల సమస్య అధికంగా ఉంటోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇళ్ల గేట్లు దాటేందుకు ప్రయత్నించడం, తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించడం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తోటవారి వీధిలో బైకును చోరీ చేస్తున్న దొంగ (ఫైల్)

జరిగిన కొన్ని చోరీల వివరాలు..

- సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన ఓ టీచరు టిఫిన్ చేద్దామని వచ్చి రోడ్డుపై బైకును ఆపి తిరిగి వచ్చే లోపు తన బైకును దొంగిలించేశారు.
- సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ పాస్టర్ తన బైకును ఇంటి ముందు నిలిపి కొన్ని గంటల వ్యవధిలో వచ్చి చూసే సరికి బైకు మాయమైపోయింది.
- నందమూరినగర్ ప్రాంతంలో గతంలో ఇంటి ముందు సీసీ కెమెరాలు ఉన్నా కూడా దొంగలు ఏ మాత్రం లెక్కచేయకుండా బైకు లాకును విర్గొట్టి దర్జాగా బైకును తీసుకెళ్లారు.

పాత నేరస్తులే నేరాలకు కారణం

కొంతమంది పాత నేరస్తులు జల్సాలకు అలవాటు పడి తేలిగ్గా డబ్బులు సంపాదించాలనే దురాశతో బైకు దొంగతనాలను చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. బైకు దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లు నిఘా పెట్టగా.. ఇప్పటి వరకూ చోరీకి గురైన పలు బైకులను.. నిందితులను గుర్తించినట్లు.. ఆ వివరాలను త్వరలోనే వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రాత్రి సమయంలో ప్రత్యేక బీట్లు ఏర్పాటు చేస్తున్నామని, దొంగతనాలు జరగకుండా అన్ని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు పోలీసులు చెబుతున్నారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, తోటవారి వీధి, ఆంధ్రప్రభ కాలనీ ప్రాంతాల్లో దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుందని.. ఈ ప్రాంతాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

కనెక్షన్ల మీద ఉన్న శ్రద్ధ.. సమస్యలపై ఏదీ?

- అడుగడుగునా యూజీడీ మ్యాన్‌హోల్స్ లీకులు
- రోడ్లపై. ఇళ్ల ముందు ప్రవహిస్తున్న మురుగుతో ప్రజలకు ఇక్కట్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అండర్ గ్రౌండ్ కనెక్షన్లు ఇవ్వడంపై అధికారులు చూపుతున్న శ్రద్ధ.. వాటి సమస్యల పరిష్కారం మీద మాత్రం చూపడం లేదు.. దీని ఫలితంగా సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

వ్యర్థాలు.. మురుగునీటితో అవస్థలు...

యూజీడీ మ్యాన్‌హోల్స్ నిండిపోవడంతో వాటి నుంచి మురుగు నీరు.. వ్యర్థాలు రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. ఇళ్ల ముందు.. రోడ్లపై అవన్నీ చేరిపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇళ్లల్లో ఉండలేకపోతున్నారు. మురుగునీరు రోడ్లపైకి చేరడంతో రాకపోకలు సాగించేందుకూ అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. సింగ్‌నగర్ ఆర్‌యూబీ మార్గం వద్ద, నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద, న్యూఆర్‌ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి.



నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

కనెక్షన్ల కోసం పోటాపోటీ...

అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ కొత్త కనెక్షన్ల కోసం అయితే అధికారులు, సిబ్బంది పోటా పోటీ పడుతున్నారు. ఎందుకంటే కొత్త కనెక్షన్ అయితే తమకు కమీషన్లు కచ్చితంగా వస్తాయని.. దీంతో వీటిని ఎవరికి ఇవ్వాలో.. ఎన్ని ఇవ్వాలో.. తమకు ఎంత ముట్టజెప్పాలో అనే లెక్కలు వేసుకోవడంలో బిజిబిజీగా గడిపేస్తున్నారు తప్ప యూజీడీ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మ్యాన్‌హోల్స్ సమస్యలను ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ సరిగా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తమకు ఇబ్బందికరంగా మారుతున్న యూజీడీ మ్యాన్‌హోల్స్ లీకులను సరిచేయించి.. సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



న్యూఆర్‌ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్ వద్ద యూజీడీ లీకులతో అధ్వానంగా ఉన్న దృశ్యం



న్యూఆర్‌ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్ వద్ద యూజీడీ లీకులతో అధ్వానంగా ఉన్న దృశ్యం

విద్యార్థులు సమయపాలన అలవర్చుకోవాలి

డాక్టర్ జగన్‌మోహన్‌రావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): చిత్తరంజన్‌శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యుడు డాక్టర్ ఎం.జగన్‌మోహన్‌రావు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై బోధనలు చేశారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తల్లి పాత్ర విశిష్టతను వివరించారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే చదువు ఒక్కటే సరిపోదన్నారు. సమయపాలన, వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలని సూచించారు. మైండ్ మ్యాపింగ్ అనేది ఆలోచనలు, సమాచారాన్ని నిర్వహించడానికి ఉపయోగించే ఒక దృశ్య గమనిక అని పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులు పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించగలరని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే రిటైర్డ్ చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శేషబాల భగవద్గీత శ్లోకాలు, ప్రభాస్ కాలేజ్ లెక్చరర్ ఈవీ ప్రేమ్ కుమార్ జనరల్ నాలెడ్జ్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వి. సాయి సుబ్బన్న మ్యాథమెటిక్స్, రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి తెలుగు సబ్జెక్టులను బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ జగన్‌మోహన్‌రావు

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ కనక దుర్గ నృత్య మందిర్‌కు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై సాయి సహస్ర పర్యవేక్షణలో 20 మందికి పైగా చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

మాతృమూర్తులకు సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగునాట క్రియేషన్స్ ఆధ్వర్యంలో పలు రంగాలకు చెందిన మహిళలను ఘనంగా సత్కరించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర డీసీపీ కేజీవీ సరిత, మోటివేషన్ స్పీకర్ సత్యవాణి, కూచిపూడి నృత్యకారిణి స్వామిసోమనాథ్, అక్కినేని హాస్పటల్స్ అధినేత డాక్టర్ మణి అక్కినేని, ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు చెందిన శృతి రెడ్డి, చంద్రగిరి జెడ్పీటీసీ పద్మజారెడ్డి, ఆదర్శ రైతు ఈశ్వరమ్మలతో పాటు పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు నాట క్రియేషన్స్ అధినేత మాదల వేణు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ఘన విజయం మన దేశంలోని మాతృమూర్తులందరి విజయం అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో ఇద్దరు మహిళలు ముందుండి నడిపించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా మహిళలు జాతీయ పతకాలను ప్రదర్శించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసుల తీరు దారుణం

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు చేసిన దౌర్జన్యం అత్యంత పాశవికమని, కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యావత్తు దేశం పాకిస్తాన్‌తో మన సైన్యం చేస్తున్న యుద్ధం గురించి ఆలోచిస్తూ వారికి మద్దతుగా కార్యక్రమాలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ప్రతిపక్షాలపై పగ, ప్రతీకార చర్యలతో దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, బీసీ మహిళపై పోలీసులతో ప్రభుత్వం చేసిన ఈ దాడిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రజనీ పీఏ శ్రీకాంత్ ఏమి చేశాడు. ఏ కేసు పెట్టారని ప్రశ్నిస్తే ఆమెపై దౌర్జన్యం చేస్తూ అరెస్ట్ చేయడం ఏమిటని మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన అరగంటకే కనీసం ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయకుండా అరెస్ట్ కోసం రోడ్డుపై అడ్డుపడటం చూస్తే పోలీసుల తప్పుడు తీరు అందరికీ అర్థమవుతోందని అన్నారు.

ప్రజాసమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం

ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయాలని చూస్తున్న ప్రభుత్వ దమన నీతిపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అమానవీయంగా ఉందన్నారు. మహిళల పట్ల ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న దిగజారుడు విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఏ ప్రభుత్వమైనా చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు వెంటాడుతుంటే వాటిని గాలికొదిలేసి ప్రతిపక్షాలపై పగ తీర్చుకోవడమే పనిగా ప్రభుత్వం పని చేస్తోందని మండిపడ్డారు. రానున్న కాలంలో ప్రజలు తగిన బుద్ది చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

నేడు లక్ష తమలపాకుల అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కళ్యాణం, భారత సైనికుల రక్షణార్థం ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం ఆంజనేయస్వామివారికి లక్ష తమలపాకుల అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ పౌర్ణమి, శ్రీ కూర్మజయంతి పురస్కరించుకుని సర్వమానవాళి, భారత సైన్యంకు ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరుతూ తాము లక్ష తమలపాకుల అర్చన ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి లక్షతమలపాకుల అర్చన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు లక్ష తమలపాకుల పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. లక్ష తమలపాకుల అర్చనల ద్వారా దేశానికి భారత సైన్యానికి ప్రజలు అండగా ఉంటామని నిరూపించాలని కోరారు.

అమ్మ ప్రేమ మధురం





మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాశక్తి నగర్ చంద్ర రాజేశ్వరరావు వీధిలో గల శిఖర స్కూల్ ప్రాంగణంలో చిన్నారులకు ఆదివారం ఆర్ట్ - క్రాఫ్ట్ కాంటెస్ట్ నిర్వహించారు. స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సృష్టిలో అమ్మ ప్రేమ ఎంత మధురమైనదో చిత్రాల ద్వారా తెలియపర్చారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సుర్రుమన్న సూరీడు

భానుడి దెబ్బకు జనం బెంబేలెత్తుతున్నారు. ఆదివారం 40 డిగ్రీలు పైనే ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ ప్రభావం చూపింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు పది గంటల కల్లా ఇళ్లకు చేరుకున్నారు. జన సంచారం లేక కొన్ని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బ తగలకుండా ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వాళ్లు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖాలు పూర్తిగా కప్పేసుకొని వాహనాలపై వెళ్తున్న చిత్రాలివి.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా ర్యాలీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా ఆదివారం కేఎల్‌రావు పార్కు నుంచి పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్కు హ్యాపీ వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్క్ బ్యాడ్మింటన్ అండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాకర్స్ ర్యాలీలో పాల్గొన్నారు. పార్కు వద్ద ప్రారంభమైన ర్యాలీని ఉద్దేశించి అసోసియేషన్ల అధ్యక్షులు బీఎస్‌కే పట్నాయక్, వేశపోగు ఆల్ఫ్రెడ్, జీ రామకృష్ణారావు ప్రసంగించారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికులకు దేశ ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్‌లో కీలక పాత్ర పోషించిన ఇద్దరు మహిళా జవాన్లకు దేశప్రజలందరి తరపున అభినందనలు తెలుపుతున్నామని చెప్పారు. దేశం కోసం అందరం కలిసిమెలసి పని చేయాలని ఇటువంటి విపత్తు పరిస్థితుల్లో సైనికులతో కలిసి పని చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కేఎల్‌రావు పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ వీఎంసీ కాలనీ, కేటీ రోడ్డు, కలరా హాస్పటల్ మీదుగా సాగింది. ర్యాలీలో భారత్ మాతకీ జై.. అంటూ చిన్నారులు, యువత నినాదాలు చేశారు. కార్యక్రమంలో జగుపిళ్ల శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వరరావు, ఎం. ప్రసాద్, సుబ్బారావు, మదన్‌మోహన్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్, చిన్నారులు, యువత

సాయిబాబా శతజయంతిపై జీఓ రద్దు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పుట్టపర్తి సాయిబాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 862ను తక్షణమే రద్దు చేయాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండగగా జరపాలని నిర్ణయించటం తగదన్నారు. ఇలా బాబాల వర్ధంతులు, జయంతులు ప్రభుత్వ పండుగలుగా చేయడం అప్రజాస్వామికమన్నారు. తక్షణమే ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని కోరారు.

మహిళలకు ఉచిత కంటి పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుష్పాహోటల్ సెంటర్‌లోని అమరావతి కంటి ఆస్పత్రిలో మహిళలకు ఉచిత కంటి పరీక్షలు (ఫ్రీ కన్సల్టేషన్) నిర్వహించనున్నట్లు ఆస్పత్రి చీఫ్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కేతినేని శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 వరకూ కొనసాగుతాయని చెప్పారు. ఈ ఉచిత పరీక్షలను మహిళా సంఘాలు, మహిళ సంస్థలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ప్రతిరోజూ ఉచిత పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.